సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



'ఓపెన్'తో ఉజ్వల భవిష్యత్

ఓపెన్ స్కూల్ విధానం ద్వారా ప్రభుత్వం నేరుగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకునే అవకాశం కల్పిస్తోంది.

- 8లో



చెరువులో పడి బాలుడి మృతి

మెంటాడ మండలంలోని పెద మేడపల్లి గ్రామానికి చెందిన బాలుడు చెరువులో కాలకృత్యాలను తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు.

- 8లో



ప్రజలకు చేరువగా ఆరోగ్య కార్యక్రమాలు

ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయా లని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు.

- 8లో

న్యూస్‌రీల్

తిత్తిరి-రంగంవలస సరహద్దులో ఏనుగులు

సీతంపేట: మండలంలోని తిత్తిరి-రంగంవలస సరిహద్దు గ్రామాల్లో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్టు గిరిజనులు శనివారం తెలిపారు. వరి, మొక్కజొన్న, కొర్ర పంటలకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నాయన్నారు. పంటలకోసం వేసిన నాలుగు పాకలు వరకు తోసివేశాయని, నీటి పైపులను ధ్వంసం చేసినట్టు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు ఎస్.మంగయ్య కోరారు.

రామతీర్థంలో బహుళ ఏకాదశి పూజలు



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారామస్వామి నిత్య కల్యాణ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని నూతన పట్టువస్త్రాలతో సుందరంగా అలకరించి స్వామివారి కల్యాణోత్సవం జరిపించారు. రాములోరి దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు పోటెత్తారు. ముందుగా రామస్వామి వారిని దర్శించి అనంతరం క్షేత్ర పాలకుడైన ఉమాసదాశివుడికి పూజలు చేశారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి సన్నిధిలో నిర్వహించిన భక్తి కళారాధన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు అడ్వకేట్‌గా మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



విజయనగరం అర్బన్: మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి హైకోర్టు అడ్వకేట్‌గా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్‌లో శనివారం సభ్యత్వం తీసుకున్నారు. ఫిలాసఫీలో డాక్టరేట్ సాధించిన ఆమె ఇటీవల లా సబ్జెక్టులో మరో డాక్టరేట్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లా పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిన వెంటనే న్యాయవాది వృత్తిలో చేరకుండా పరిశోధనలపై దృష్టి సారించానన్నారు. లా సబ్జెక్టులో డాక్టరేట్ సాధించడంతో వృత్తిలో చేరినట్టు తెలిపారు. ఉత్తమ పార్లమెంటీరియన్‌గా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా ప్రజా సేవలందించిన ఆమె న్యాయవాద వృత్తిలో చేరడంపై పలువురు అభినందించారు.

జూనియర్ సివిల్ జడ్జిగా వివేక్ వర్ధన్

విశాఖ లీగల్/మురళీనగర్: నగరంలోని మురళీనగర్‌కు చెందిన పాడిపిరెడ్డి వివేక్ వర్ధన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఇటీవల హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి-2022 పరీక్షల్లో అర్హత సాధించారు. జూలై 6న హైకోర్టు ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఆయన్ని జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో 2019లో వివేక్ వర్ధన్ లా డిగ్రీ పూర్తి చేసి న్యాయవాద పట్టా పొందారు. 2020, 2021లో హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు హాజరై.. విఫలమయ్యారు. మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. వీరిది విజయనగరం జిల్లా జామి మండలం కొట్టం. ప్రస్తుతం మురళీనగర్‌లో నివసిస్తున్నారు.

సమగ్రంగా ఓటరు సర్వే





పార్వతీపురం మండలంలో ఓటరు సర్వే తీరును పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

- ఈ నెల 21కి శతశాతం సర్వే లక్ష్యం
- జిల్లాలో 2,74,326 ఇళ్లలో 1,69,408 ఇళ్ల సర్వే పూర్తి

పార్వతీపురంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్ఓలు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఓటరు ఐడీ కార్డులను పరిశీలిస్తున్నారు. తప్పొప్పుల సవరణ, కొత్తఓటర్ల నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మృతులు, నకిలీ ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారు. గత నెల 20 నుంచి చేపట్టిన సర్వే చివరి దశకు వచ్చింది.

నియోజకవర్గం	నివాస గృహాలు	సర్వే పూర్తి చేసిన గృహాలు	మొత్తం ఓటర్లు	సర్వే పూర్తి చేసిన ఓటర్ల సంఖ్య
పాలకొండ	81,414	28,027	1,97,976	1,33,344
కురుపాం	67,998	49,753	1,91,112	1,39,977
పార్వతీపురం	57,618	20,154	1,88,090	1,26,283
సాలూరు	67,296	38,006	1,97,395	98,346

జిల్లాలో నియోజకవర్గాల వారీగా..

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నాటికి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వే పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నారు.

పక్కాగా సర్వే

గత నెలలో జిల్లాలోని 1024 పోలింగ్ స్టేషన్లకు 1024 మంది పోలింగ్ అధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ నియమించారు. గత నెల 12 నుంచి 20 వరకు పోలింగ్ అధికారులకు శిక్షణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. జూలై 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1024 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,74,326 నివాసాలు ఉన్నాయి. నూరు శాతం నివాసాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 1,69,408 ఇళ్లకు వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించారు. 4,155 మంది కొత్త ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోగా వాటిలో 3,998 దరఖాస్తులు అధికారులకు అందాయి. 994 డూప్లికేట్ ఓట్లు, 2,198 మంది మృతి చెందిన ఓటర్లను గుర్తించారు. వీటినిపరిశీలించిన అనంతరం ఓటర్ల జాబితా నుంచి తొలగించనున్నారు. ఓటరు కార్డులో చిరునామాలు, ఇతర మార్పుల కోసం 47,749 దరఖాస్తులు అందాయి. మరోవైపు రాజకీయ పార్టీలతో మూడు విడతల్లో కలెక్టర్ నేతృత్వంలో సమావేశాలు నిర్వహించారు. జూలై 20, 26 తేదీలు, ఈ నెల 9న సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించారు.

21 నాటికి సర్వే పూర్తి



జిల్లాలో ఈ నెల 21 నాటికి నూరుశాతం సర్వే పూర్తిచేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఓటర్ల జాబితా సర్వేపై ప్రతి రోజు సమీక్షిస్తున్నాం. రాజకీయ పార్టీల నాయకులతో మూడు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించాం. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని అధికారులకు సూచించాం. 2024 జనవరి 1వ తేదీనాటికి ఓటరుగా అర్హత ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తున్నాం.

– నిషాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

జగన్ అంటే సంక్షేమానికి బ్రాండ్



సాలూరు మున్సిపాలిటీలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన శుభసందర్భంగా కేక్‌కట్ చేస్తున్న డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, పాల్గొన్న నాయకులు

- ఎన్టీఆర్, వైఎస్సార్‌లను మించిన సంక్షేమ పాలన
- అన్నివర్గాల ప్రజలకు పాలన చేరువ
- సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థికోన్నతి
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకే ప్రజల ఓటు
- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక, చారిత్రాత్మక సంస్కరణలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశవ్యాప్తంగా పేరు పొందాయని, జగన్ అంటే పేరుకాదు బ్రాండ్‌గా మారిందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం సాలూరు మున్సిపాలిటీలో శనివారంతో పూర్తయింది. ఈ సందర్భంగా స్థానిక సీతారామకళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి ప్రజాప్రతినిధులు, నాయకులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రులైన ఎన్.టి.రామారావు, వై.ఎస్.రాజశేఖరరెడ్డిలను మించిన సంక్షేమ పాలనను ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకేలను ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏర్పాటుకు ఆయా ప్రభుత్వాలు ఆలోచనలు చేస్తున్నట్టు వెల్లడించారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుక్ మాండవీయ కొన్ని నెలలు కిందట విజయనగరంలో పర్యటించిన క్రమంలో సచివాలయ, ఆర్‌బీకేల పనితీరును చూసి ప్రశంసించారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చరిత్రాత్మకమైనదిగా పేర్కొన్నారు.

- ప్రభుత్వపాలన ప్రజలకు అందుతున్న తీరును ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి తెలుసుకునే బృహత్తర కార్యక్రమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలనే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా నిలుపుతుందన్నారు.
- సాలూరు మున్సిపాలిటీలో లక్షా8వేల260 మంది లబ్ధిదారులకు నాలుగేళ్లలో వివిధ పథకాల కింద సుమారు రూ.171 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని జమచేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.
- జగనన్న సురక్ష కార్యక్రమంలో నియోజకవర్గంలో సుమారు 45 వేల సర్టిఫికెట్లు ఉచితంగా అందించామని తెలిపారు. మున్సిపాలిటీకి 14, 15వ ఆర్థిక సంఘం, గడపగడపకుమన ప్రభుత్వం కింద వివిధ అభివృద్ధి పనులకు రూ.14కోట్ల 9 లక్షలు మంజూరైనట్టు వెల్లడించారు. ఇప్పటికే సుమారు రూ.7 కోట్ల 10 లక్షల విలువైన పనులు జరిగినట్టు తెలిపారు. గడపగడపకు మనప్రభుత్వం కింద గుర్తించిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి ఇస్తున్న రూ.20 లక్షలకు అదనంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని మున్సిపాలిటీల సచివాలయాలకు మరో రూ.20లక్షలు కేటాయించాలని ముఖ్యమంత్రికి విన్నవించిన వెంటనే ఉదారంగా నిధులు మంజూరు చేశారన్నారు.
- సాలూరు మున్సిపాలిటీలో నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు రూ. 9 కోట్లు మంజూరుకాగా, రూ.5 కోట్ల విలువైన పనులు జరిగాయని, మరో రూ.4 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందన్నారు. సాలూరు బైపాస్ నిర్మాణం పూర్తిచేశామని, వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వంద పడకల ఆస్పత్రికి నాడు కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్న టీడీపీ నాయకులు, ఇటీవల శరవేగంగా సాగుతున్న పనులను చూసి బిక్కమొహం వేస్తున్నారన్నారు.
- టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.105 కోట్లు కేటాయించినట్టు వివరించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడం లేదని, మంజూరైన పనులు నిర్మాణాలు వేగవంతంగా చేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి, జగన్‌మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గొర్లె జగన్, గిరి రఘు, రాపాక మాధవరావు పాల్గొన్నారు.

మెలకువలతో సాగుదాం

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- జిల్లాలో లక్షా75వేల ఎకరాల్లో వరి సేద్యం
- అనుకూలించిన వర్షాలు
- 306 రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతన్నలకు సేవలు
- అన్నదాతల అవసరం మేరకు 42,253 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ
- 56వేల ఎకరాల్లో ఊపందుకున్న దమ్ములు, ఉభాలు



పంటకు ఎరువు సిద్ధం చేస్తున్న రైతు

పాలకొండ రూరల్: వరుణుడు సకాలంలో కరుణించాడు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో పుష్కలంగా వర్షపు నీరు చేరింది. వరి నాట్లు వేయడంలో రైతులు బిజీ అయ్యారు. రైతులకు ఓ వైపు ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసాతో పెట్టుబడి సాయం, విత్తనాలు అందించడంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని 306 రైతు భరోసా కేంద్రాల్లో 42వేల మెట్రిక్ టన్నుల ఎరువులను నిల్వచేసింది. అవసరం మేరకు రైతులకు పంపిణీ చేస్తోంది. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం లక్షా75వేల ఎకరాలు కాగా, 56వేల ఎకరాల్లో ప్రస్తుతం దమ్ములు చేసి నాట్లు వేయడంలో రైతన్నలు నిమగ్నమయ్యారు. మిగిలిన భూమిలో వరి వెదలు సాగుచేస్తున్నారు. వరి ఉభాలు ఊపందుకున్న వేళ వ్యవసాయ అధికారులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులకు విలువైన సాగు సూచనలు అందిస్తున్నారు. ఎరువులను మోతాదుకు మించి వేయవద్దని చెబుతున్నారు. అధిక దిగుబడుల సాధనకు అనువైన పద్ధతులను వివరిస్తున్నారు.

ఉభాలు వేస్తున్నారా..

- భూమిలో అంగుళం లోతుగా నాట్లు వేసుకుంటే మంచిది. నారు వేసిన వెంటనే మూడు రోజుల్లోగా కలుపునివారణకు పిండి మిథాలిన్ ఎకరానికి అరలీటరు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ప్రతీ రెండు మీటర్లకు 25 సెంటీమీటర్ల మేర కాలిబాటలు ఉంచుకోవాలి. తాడు పద్ధతిలో నాట్లు వేయడం శ్రేయస్కరం. చేనుకు గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడులు వస్తాయి.
- పొలంలో ఎలుకల ఉధృతి అధికంగా ఉంటే ఎలుకల బుట్టలు ఏర్పాటు చేయాలి. పొలంలో గట్లను తగ్గించం ద్వారా ఎలుకలను నివారించవచ్చు. వాటి బొరియలను గుర్తించి కప్పిపెట్టాలి.

ఎరువుల వినియోగం, ప్రయోజనం ఇలా...

- నత్రజనిని యూరియా రూపంలో రైతులు వాడుకోచ్చు. నత్రజని పంటల ఎదుగుదలకు, పచ్చదనానికి ఉపయోగపడుతుంది.దీనిని మూడు భాగాలుగా విభజించి వాడాలి. మొదటి భాగం సాగులో దమ్ముచేసే ముందు దమ్ములో వేయాలి. రెండో భాగం పిలకలు వేసే దశలో, మూడో భాగం పొట్ట(అంకురం) ఏర్పడే సమయంలో వేయాల్సి ఉంటుంది. వెద జల్లే పద్ధతిలో బురద పనుల్లో మాత్రమే 36 నుంచి 48 గంటల తరువాత కొద్దిపాటి నీరు పెట్టాలి. అదేవిధంగా 50 కిలోల యూరియాకు 10 కిలోల వేపపిండి, 250 కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో వాడితే నత్రజని పూర్తిస్థాయిలో చేనుకు అందుతుంది.
- భాస్వరం మొక్కల వేర్లు ధ్రుడపడటానికి ఉపయోగపడుతుంది. ఈ ఎరువును పూర్తిగా దమ్ము సమయంలో వేయాలి. లేదా ఉభాలు జరిపిన పది రోజులలోపు వేయాలి. ఎకరాకు 50 కేజీల వరకు వాడుకోవచ్చు.
- పొటాష్ వాడటం వలన ఆకులు గరుకు కలిగి ఉంటాయి. దీనివలన పైరుకు చీడ పీడల బెడద తగ్గుతుంది.
- పిండి పదార్థం తయారీకి ఎంతగానో సహకరిస్తుంది. పొటాష్ నాట్లు వేసిన 10రోజుల్లో 15 కేజీలు, చిరు పొట్ట దశలో మరో 15 కేజీలు రెండు భాగాలుగా వేసుకుంటే మేలు.
- ఎకరాకు 20 కేజీల చొప్పున జింకును ఇసుకలో కలిపి దమ్ములో తొలి పది రోజుల్లో వేసుకుంటే గింజలో నాణ్యత పెరుగుతుంది. రైతులు వరి ధాన్యం అమ్ముకునే సమయంలో గింజ నూక కాకుండా జింక్ సహకరిస్తుంది. జింక్ లోపాలను గుర్తిస్తే అధికారుల సూచనల మేరకు జింక్ సల్ఫేట్‌ను అవసరమైన మోతాదులో పిచికారీ చేయాలి.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఎరువుల నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువు రకం	జిల్లాకు కేటాయింపులు	సరఫరా చేసిన ఎరువులు	వినియోగించిన ఎరువులు	అందుబాటులో ఉన్న నిల్వలు
యూరియా	20,528	14,288	9,573	4,715
డీఏపీ	6,593	7,666	4,474	3,192
కాంప్లెక్స్	9,119	3,708	2,089	1619
పోటాష్	3,308	1128	414	714
సూపర్ ఫాస్ఫేట్	2,975	2,694	1865	769

అవగాహన పెంచుకోవాలి



రైతులు వరిలో అధిక దిగుబడులు పెంచుకునేందుకు పంటల సేద్యంపై అవగాహన కలిగి ఉండాలి. చిన్నచిన్న మెలకువలు పాటిస్తే సాగు లాభదాయకంగా ఉంటుంది. ఎరువుల వినియోగంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 42వేల మెట్రిక్ టన్నులు అందించేలా నెలవారీ ప్రణాళికతో పంపిణీ చేస్తున్నాం.

– కె.రాబర్ట్‌పాల్, జిల్లావ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం

ముగిసిన మొదటిదశ 'మిషన్ ఇంద్రధనస్సు'



టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.టి.జగన్మోహన్‌రావు

- జిల్లా వ్యాప్తంగా 1500 మందికి టీకాలు
- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో మొదటి దశ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం శనివారంతో ముగిసిందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.టి.జగన్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని నర్సిపురం, వెంకంపేట గ్రామాల్లో చివరిరోజు టీకా కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు శత శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 715 వ్యాక్సినేషన్ సెంటర్లలో 1500 మంది పిల్లలకు టీకాలు వేసినట్టు వెల్లడించారు. మిషన్ ఇంద్రధనస్సు రెండోదశ కార్యక్రమం సెప్టెంబర్‌లోను, మూడో దశ అక్టోబర్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయగౌడ్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసంగి పరిసర ప్రాంతాల్లో గజరాజులు



బాసంగి వద్ద అరటి తోటలో గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పరిసర ప్రాంతాలలో గజరాజుల గుంపు దర్శనమిచ్చాయి. శనివారం సాయంత్రం నాగావళి నది నుండి బాసంగి గదబవలస, వెంకటరాజపురం పంట పొలాల్లోకి ప్రవేశించాయి. అరటి, పామాయిల్ తోటలలో ఉంటూ వరి చేలలోకి వెళ్లాయి. హరి అనే ఏనుగు ఒంటరిగా ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

బొండపల్లి/మెంటాడ: మెంటాడ మండలంలోని పిట్టాడ గ్రామానికి సమీపంలో కొద్ది రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తి మతి స్థిమితం లేక అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి ఆంధ్ర పోలీసులకు శుక్రవారం సాయంత్రం సమాచారం ఇచ్చారు. ఆ వృద్ధుడిని 108 వాహనంలో ఎస్‌ఐ సిద్ధార్థ కుమార్ గజపతినగరం సీహెచ్‌సీకి తరలించే ఏర్పాట్లు చేశారు. పరిస్థితి విషమించడంతో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 91211 09460 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన పెందుర్తి సూర్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి శనివారం దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెందుర్తి సూర్యనారాయణ(60) తన పత్తి తోటలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో పొలానికి తడులు అందించేందుకు సమీపంలో ఉన్న మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లగా విద్యుత్ ఘాతానికి గురై తీవ్ర అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు సూర్యనారాయణను నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ దాము తెలిపారు.

యువకుడు..



సత్యనారాయణ (ఫైల్)

లక్కవరపుకోట : మండలంలోని రంగరాయపురం గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో కరెడ్ల సత్యనారాయణ(28) మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు.. మృతుడు సత్యనారాయణ ఐటీఐ చదువుకొని గ్రామంలో ప్రైవేట్‌గా విద్యుత్ పనులు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని విద్యుత్ స్తంభం ఎక్కి పనులు నిర్వహించి దిగే క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందకు పడిపోయాడు. స్థానికులు వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబానికి అండగా ఉన్న కుమారుడు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

‘ఓపెన్’తో ఉజ్వల భవిష్యత్

చదువు మధ్యలో ఆపేసామనే కలత చెందాల్సిన అవసరం లేదు. ఉద్యోగం ఉంది.. ఉన్నత చదువులకు అవసరమైన టెన్త్, ఇంటర్మీడియట్ చదువుకోలేదని చింతించాల్సిన పని అంతకన్నా లేదు. అందరూ చదువుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పిస్తోంది. ఏపీ ఓపెన్ స్కూల్ విద్యద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ చదువులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. కావాల్సిందల్లా ఆసక్తి మాత్రమే..

- రెగ్యులర్ కోర్సులతో సమానంగా టెన్త్, ఇంటర్ చదువుకునే అవకాశం
- జిల్లా వ్యాప్తంగా 20 స్టడీ సెంటర్లు
- గత ఐదేళ్లలో 18,699 మంది సద్వినియోగం
- ఈ ఏడాది అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల





చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్, (ఇన్‌సెట్లో) ఏపీ ఓపెన్‌స్కూల్ సొసైటీ లోగో(ఫైల్)

చీపురుపల్లి: ఓపెన్ స్కూల్ విధానం ద్వారా ప్రభుత్వం నేరుగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకునే అవకాశం కల్పిస్తోంది. టెన్త్, ఇంటర్మీడియెట్ క్వాలిఫికేషన్ కావాలనుకునే వారికి ఇదొక సువర్ణ అవకాశం. ప్రతీ ఒక్కరి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తుంది ఓపెన్ స్కూల్. దీని కోసం జిల్లా వ్యాప్తంగా 20 స్టడీ సెంటర్లను కూడా నిర్వహిస్తున్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్ చదువుకోవాలనుకునే వారికి 14 సంవత్సరాలు నిండితే చాలు గరిష్ట వయస్సు ఎంతైనా ఉండొచ్చు. ఈ ఏడాదిలో నిర్వహించే కోర్సులకు సంబంధించి అడ్మిషన్ల కోసం ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నుంచి నోటిఫికేషన్ కూడా విడుదలైంది.

గత ఐదేళ్లలో 18,699 మంది సద్వినియోగం

ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా 20 స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఆ స్టడీ సెంటర్ల ద్వారా గత ఐదు సంవత్సరాల్లో 2018 – 19 విద్యా సంవత్సరం నుంచి 2022 – 23 విద్యా సంవత్సరం వరకు 18,699 మంది అభ్యర్థులు టెన్త్, ఇంటర్మీడియెట్‌లో చేరి ఓపెన్ స్కూల్ విధానాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అడ్మిషన్ పొందిన వారి కోసం స్టడీ సెంటర్లలో ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఒకసారి అడ్మిషన్ పొందిన తరువాత ఐదేళ్ల కాలంలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ల వివరాలు		
సంవత్సరం	టెన్త్	ఇంటర్
2018-19	2372	1686
2019-20	3066	3094
2020-21	1662	1731
2021-22	1423	1620
2022-23	779	1270

దరఖాస్తు ఇలా..

- ఆగస్టు 31లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- 2023 సెప్టెంబరు 25లోగా ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలి.
- జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 స్టడీ సెంటర్లకు వెళ్లి అక్కడున్న కోఆర్డినేటర్ వద్ద దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవాలి.
- పదో తరగతిలో అడ్మిషన్ పొందాలనుకునే జనరల్ పురుషులు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,400 చెల్లించాలి.
- ఇతర అన్ని వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది.
- ఇంటర్మీడియెట్‌లో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,600 చెల్లించాలి.
- ఇతర వర్గాల్లో ఉన్న పురుషులు, మహిళలకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజులు రూ.1,300 చెల్లించాల్సి ఉంటుంది.
- పదో తరగతి అడ్మిషన్ తీసుకోవాలనుకునే వారు దరఖాస్తుతో బాటు టీసీ, రికార్డ్ షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం అందజేయాలి.
- ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం పదో తరగతి మార్కుల జాబితా, టీసీ సమర్పించాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం మసర్పించాలి.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించాం

ఈ ఏడాదికి సంబంధించి ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ చదువుకునే వారి కోసం నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కూడా ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా 20 స్టడీ సెంటర్లు ఉన్నాయి. వాటి ద్వారా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. చదువు మధ్యలో ఆపేసిన వారు, ఉద్యోగ ఉన్నతి కోసం ఎదురు చూస్తున్న వారు ఓపెన్ స్కూల్ విధానం సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మీకుమారి, అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం

ఉపాధ్యాయుల పట్ల అధికారుల తీరు మారాలి

- ఫ్యాప్టో 12 గంటల నిరసన దీక్షలో ఎమ్మెల్సీ రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయుల పట్ల అధికారుల వ్యవహరిస్తున్న వైఖరి మార్చుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (ఫ్యాప్టో) జిల్లా కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట శనివారం చేపట్టిన 12 గంటల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యారంగం, ఉపాధ్యాయులపై ప్రభుత్వం చూపుతున్న వ్యతిరేక వైఖరిని విమర్శించారు. ఉపాధ్యాయుల పట్ల పాఠశాల విద్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనుసరిస్తున్న వైఖరి అవమానకరంగా ఉందని ఆరోపించారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జీఓ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ సీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ జె.రమేష్ చంద్రపట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ డి.శ్యాం, పి.శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులు కేఏవీఆర్‌కే ఈశ్వరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు బంకురు జోగినాయుడు, షేక్ బుకారి బాబు, డి.ఈశ్వరరావు, వై.అప్పారావు, సీహెచ్ రాము, మోహనరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ఆరోగ్య కార్యక్రమాలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలకంటే అదనంగా సౌకర్యాలు హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్‌లో ప్రభుత్వం కల్పించిందన్నారు. అందుకు అనుగుణంగా సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చే విధంగా పని చేయాలని తెలిపారు. మనసు పెట్టి సేవలు అందిస్తే ప్రజలు బ్రహ్మరథం పడతారని తెలిపారు. గ్రామస్థాయిలోనే చాలా వరకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హెల్త్ వెల్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. మంచి వైద్య సేవలు అందిస్తున్నారనే నమ్మకాన్ని ప్రజల్లో కల్గించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డీఐఓ అచ్యుతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడని ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపారు. మండల పరిధి కొఠారిపురం గ్రామానికి చెందిన బట్న లక్ష్మీనారాయణ శ్రీకాకుళం రోడ్డులోని మెకానిక్ షాపు వద్ద బైక్‌తో పాటు నిల్చుని ఉన్నాడు. అదే సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి రాజాం వైపు వస్తున్న కారు మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. మోటార్‌సైకిల్ తనపై పడడంతో గాయాలయ్యాయని బాధితుడు ఫిర్యాదు చేయడంతో క్షతగాత్రుడిని ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన బాలుడు వరుణ్

బొండపల్లి/మెంటాడ: మండలంలోని పెద మేడపల్లి గ్రామానికి చెందిన బాలుడు చెరువులో కాలకృత్యాలను తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఆంధ్ర ఎస్‌ఐ సిద్ధార్థ కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పత్తిగుళ్ల వరుణ్(8) గ్రామంలో ఉన్న పాఠశాలలో చదువుతున్నాడు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని నక్కల బంద చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోగా స్థానికులు గుర్తించి వెలుపలికి తీసి గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి బొత్స పరామర్శ

గజపతినగరం: వైద్య రంగంలో విశిష్ట సేవలందించి పలువురికి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బీఎస్సార్ మూర్తి మృతి చెందడం వైద్య రంగానికి తీరని లోటని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మూర్తి నివాస గృహానికి శనివారం వెళ్లిన మంత్రి బొత్స ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రితో పాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య బీఎస్ఆర్ మూర్తి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి తమ సంతాపం తెలిపారు. వారి వెంట పార్టీ సీనియర్ నేతలు నారాయణమూర్తిరాజు, ప్రభూజీ రాజు, జెడ్పీటీసీ గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు ఉన్నారు.



డాక్టర్ బీఎస్సార్ మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి బొత్స, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తదితరులు

పోలీసుల అదుపులో జూదరులు

శృంగవరపుకోట: మండలంలోని శివరామరాజుపేట సమీపంలో శనివారం ఎస్.కోట పోలీసులు నిర్వహించిన దాడుల్లో పలువురు జూదరులు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తారకేశ్వరరావు అందించిన వివరాలు.. పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఏడుగురు పేకాట రాయుళ్లు పట్టుబడ్డారని, వారి నుంచి రూ.3020లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఎస్.కోట పోలీసుస్టేషన్స్ ఆవరణలో ఎస్ఈబీ ఏఈఎస్ శైలజారాణి సమక్షంలో ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస పోలీసుస్టేషన్స్ గతంలో సీజ్ చేసిన మద్యం, సారా సుమారు 19 కేసు ల్లో పట్టుబడిన మద్యం, సారా ను పారబోసినట్లు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: స్థానిక కోట జంక్షన్ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.28,300 నగదు స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఈ నెల 21న నిర్వహించనున్న ‘చలో విజయవాడ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం స్థానిక సంగ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మువ్వల గంగాప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి చందక శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీను, కోశాధికారి పి.రామలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ఎం.మంగరాజు, కార్యదర్శి రమేష్, తదివతరులు పాల్గొన్నారు.

పొలానికి నీటి తరలింపుపై కొట్లాట

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి
- ఐదుగురు కార్యకర్తలకు గాయాలు
- కొరమలో ఉద్రిక్త పరిస్థితులు



బాధితులతో మాట్లాడుతున్న సీఐ మురళీధర్, ఎస్‌ఐ అమ్మనరావు

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పొలంలో నీరు తీస్తున్నారనే విషయమై జరిగిన దాడిలో ఏడుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకులు దాడి చేయడంతో ఐదుగురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని గ్రామస్తులు కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అగతముడి మోహనరావు, అప్పలనాయుడు, వరలక్ష్మి, మహేష్, జానకిలను మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ యతిరాజులు అమ్మనరావు తెలిపారు. మరో వర్గానికి చెందిన అగతముడి ధర్మారావు, లక్ష్మీనారాయణకు స్వల్ప గాయాలైనట్లు చెప్పారు. గాయపడ్డ వారిని కొత్తూరు ఆస్పత్రిలో పాలకొండ సీఐ మురళీధర్ పరామర్శించి కొట్లాటకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. కొరమలో పరిస్థితిని సమీక్షించారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బత్తిలి ఎస్‌ఐ అమ్మనరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన అగతముడి మోహనరావు కుటుంబ సభ్యులు తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా టీడీపీ నాయకులు అగతముడి ధర్మారావు, లక్ష్మీనారాయణ తన వర్గంతో వారితో దాడి చేశారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అగతముడి రఘుపతినాయుడు ఆరోపించారు.



తీవ్రంగా గాయపడిన మోహనరావు



గాయపడిన అప్పలనాయుడు



గాయపడిన వరలక్ష్మి

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఐపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఏదైనా డిగ్రీ లేదా పీజీ పాసై ఉండాలన్నారు. 20 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నిర్ణీత రుసుంతో ఎంహెచ్ఏ, పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ గ్యాస్ట్రో ఎంట్రలాజీ, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ టెక్నాలజీ కోర్సుల్లో ఏయూ, ఆర్‌ఏయూతో కలిసి అడ్మిషన్లు జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.